# గ్రామస్థుల చేతిలో ఉన్మాది హతం!




నేరాలు చేసి, చేసి ఉన్మాదిగా మారిన అతను స్నేహితుడ్ని హత్య చేసేందుకు కూడా వెనుకాడలేదు. అతను స్నేహితుడ్ని ఎందుకు హత్య చేశాడో పోలీసులు తెలుసుకోకుండానే గ్రామస్థుల ఆగ్రహానికి గురై వారి చేతిలో హత్య గావింపబడ్డాడు. ఉన్మాదిగా మారిన అతను తమ ఊరిలో ఉంటే మరెంత మందిని హతమారుస్తాడోనన్న భయంతో గ్రామస్థులంతా ఏకమై అతనిని కొట్టి చంపారు. సైబరాబాద్ కమిషనరేట్, అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఉదంతం సంచలనం సృష్టించింది.

ఆ రోజు ఏప్రిల్ 18, 2002, సాయంత్రం 5 గంటలు. అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ టి. వెంకన్న తన కార్యాలయంలో కూర్చొని ఫైళ్ళను పరిశీలిస్తున్నారు. ఇంతలో ఓ 20 ఏళ్ళ యువకుడు ఏడ్చుకుంటూ ఆయన ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఫైళ్ళలో నుండి దృష్టిని మళ్ళించి ఏమైందని అడిగారు. దానికి అతను బోరున ఏడుస్తూ "మా అన్న ప్రకాశ్ నిన్నటి నుండి కనబడటం లేదు. నిన్న ఉదయం మా అన్నను బాలరాజ్ అనే అతని స్నేహితుడు తన వెంట తీసుకెళ్ళాడు. వరంగల్ వెళ్తున్నామని చెప్పి వెళ్ళారు. తీరా చూస్తే ఈ రోజు మధ్యాహ్నం అతను వచ్చేశాడు. బాలరాజ్‌ను 'మా అన్న ఏమైనాడని అడిగితే' నాకు తెలియదని కొంతసేపు, మరో స్నేహితుడితో వెళ్ళాడని కొంతసేపు చెబుతున్నాడు. అతని సమాధానం మాలో మరిన్ని అనుమానాలను కలిగిస్తున్నది. ఇంట్లో అమ్మా, నాన్న ఐతే చాలా బెంగతో ఉన్నారు. మీరే ఎలాగైనా మా అన్నను వెదికి మా దగ్గరికి వచ్చేలా చేయాలి." అని ప్రాధేయపడ్డాడు. అతని ఆవేదనను అర్థం చేసుకున్న ఇన్‌స్పెక్టర్ వెంటనే ఎస్.ఐ. వెంకటేష్‌ను పిలిచి, అతను చెప్పే వివరాలు తీసుకుని వాళ్ళన్న ఏమయ్యాడో విచారణ చేయమని ఆదేశించారు. ఎస్.ఐ. అతను చెప్పిన వివరాల ప్రకారం యువకుడు తప్పిపోయినట్లుగా కేసు నమోదు చేసుకున్నారు. వెంటనే ఈ అదృశ్యం వెనుక ఫిర్యాదుదారులు వ్యక్తం చేసిన అనుమానం ప్రకారం బాలరాజ్ అనే వ్యక్తి గురించి ఆరా తీశారు. దాంతో పోలీసుల విచారణలో మరిన్ని ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి.

బాలరాజ్ అనే వ్యక్తి మెదక్ జిల్లా, ములుగుకు చెందినవాడు. అక్కడ ఒకప్పుడు మిలిటెంట్‌గా పనిచేసిన బాలరాజ్‌ను ఆ గ్రూప్ వాళ్ళు బహిష్కరించడంతో, అక్కడి నుండి తప్పించుకుని వచ్చి హైదరాబాదు నగరంలో తలదాచుకుంటున్నాడు. ఇతను నగరానికి రాగానే బోయిన్‌పల్లి ప్రాంతంలో ఉంటూ ఒక వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని, అది కాస్త ఆమె భర్తకు తెలియడంతో అతనిని హతమార్చి, ఆ విషయం బయటపడడంతో అక్కడినుండి అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కానాజిగూడ, సుభాష్‌నగర్‌కు మారాడు. అక్కడ కూడా కొంతమంది మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలానికి ఆ కాలనీలో ఉన్న వరగంటి ప్రకాశ్‌తో పరిచయాన్ని పెంచుకున్నాడు. ఆ పరిచయంతోనే ఏప్రిల్ 16, 2002 ఉదయం అతని ఇంటికి వచ్చిన బాలరాజ్ సరదాగా బయటకు వెళదాం రమ్మని తీసుకెళ్ళాడు. అలా బయటకు వెళ్ళిన వాళ్ళిద్దరూ మెదక్ జిల్లా తోముగుంటలో ఉన్న ప్రకాశ్ వాళ్ళ అక్క ఇంటికి వెళ్ళారు. ఆ రాత్రికి అక్కడే నిద్రించిన వాళ్ళిద్దరూ తెల్లవారుజామున లేచి తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో వారిద్దరికి ఏమి గొడవయ్యిందో తెలియదుగాని, బాలరాజ్, ప్రకాశ్‌ను అతి కిరాతకంగా హత్యచేసి శవాన్ని తోముగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుట్టల్లో విసిరేసి మరలా కానాజిగూడకు వచ్చేశాడు.

వచ్చిన బాలరాజ్ ఏమి తెలియనట్లు ప్రకాశ్ ఇంటికి వెళ్ళి 'అతని సోదరుడి'తో 'మీ అన్నేడ'ని అడిగేసరికి, 'వారికి అనుమానం వచ్చి' 'నిన్న నీ వెంటే వచ్చాడు కదా' అని ప్రశ్నించారు. దానికి అతను నిన్న నా వెంట వచ్చిన మాట వాస్తవమేగాని, దారిలో మరో ఫ్రెండ్ కలిస్తే దిగిపోయాడని కొంతసేపు, నాకు అస్సలు ఏమీ తెలియదని కొంతసేపు సమాధానం చెప్పడంతో అనుమానం పెరిగి పోలీసులకు ఫిర్యాదు చేయడం, దానిపై పోలీసులు వెంటనే అప్రమత్తమై విచారణ చేయడంతో నిజాలు వెలుగు చూశాయి.


ఫిర్యాదు అందుకున్న పోలీసులు తోముగుంటకు వెళ్ళి బాలరాజ్ అనే వ్యక్తి ప్రకాశ్‌ను అక్కడికి తీసుకెళ్ళిన విషయాన్ని నిర్ధారించుకుని, సదరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి 'ఏప్రిల్ 17న ఏదైనా గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందా?' అని విచారించారు. దాంతో ప్రకాశ్ మరణించాడన్న విషయం కూడా నిర్ధారణకు వచ్చింది. దాంతో హంతకుడు బాలరాజ్‌ను పట్టుకోవడంకోసం పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. అతను ఏ ఏ చిరునామాల్లో ఉన్నాడో అవన్నీ ఆరా

తీశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. అతన్ని గాలించడం కోసం ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటుచేశారు. ఇలా ఒక నెల రోజులు గడిచిపోయాయి. కాని అతని ఆచూకీ ఏ మాత్రం తెలియడంలేదు. పోలీసులు పట్టు వదలని విక్రమార్కుల్లా ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఆ రోజు మే 16, 2002. ఉదయం 10 గంటలకు అల్వాల్ పోలీస్‌స్టేషనంతా జనంతో కిటకిటలాడుతోంది. అప్పుడే వచ్చిన ఇన్‌స్పెక్టర్ టి. వెంకన్న తన కార్యాలయంలోకి వెళ్ళి కూర్చుంటూనే 'ఏమిటి బయట అంత జనం' అని ప్రశ్నించారు. దానికి ఎస్.ఐ. వెంకటేష్ 'కానాజిగూడలో గ్రామంలోని ప్రజలంతా కలిసి ఒక కరుడుగట్టిన ఉన్మాదిని హత్య చేశారంట. దానిని చూసినవారు చెప్పడానికి వచ్చారు.' అని చెప్పి విషయాన్ని వివరించాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ అక్కడకు వెళదాం పదండని కొంత మంది సిబ్బందిని వెంటబెట్టుకుని కానాజిగూడ సుభాష్‌నగర్‌కు వెళ్ళారు. అప్పటికే అక్కడి జనం గుమిగూడి ఉన్నారు. జీపు ఆగగానే అక్కడున్న ప్రజలను అసలేమైందని అడిగారు ఇన్‌స్పెక్టర్ వెంకన్న. దానికి వారు 'అయ్యా వీడు కొంతకాలం క్రితం బస్తీకి వచ్చాడు. వచ్చిన దగ్గర్నుండి ఎవరిని మనశ్శాంతిగా బతకనియ్యలేదు. మా కళ్ళముందు తిరుగుతున్న ఒక అమాయకపు పోరడ్ని కతంబట్టిచ్చినాడు' అంటూ అందరూ దుయ్యబట్టారు. అదంతా సరేలే ఇతనిని ఇక్కడికి తీసుకొచ్చి చెట్టుకు కట్టేసి కొట్టి చంపిందెవరని ప్రశ్నించారు. దానికి మేమంటే మేమని వందలాది ముందుకు వస్తుంటే ఇనస్పెక్టర్ వెంకన్నకు అయోమయం అయిపోయింది. చచ్చినవాడు నిజంగా హత్యలు చేసినవాడు, ఉన్మాది. అంతా ఓకే. కాని అతనిని బహిరంగంగా ఇంతమంది కలిసి హత్యచేయడం అంతకన్నా నేరం. అయినా అతనిని మేమే చంపామని ఇంతమంది ముందుకొస్తే ఎలా రియాక్టు కావాలో ఆయనికి అర్థం కాలేదు. ఒక రెండు నిముషాలు బాగా ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికి వచ్చిన ఆయన 'ఎవరెవరూ చంపారని ఒప్పుకుంటున్నారో వాళ్ళందర్నీ ఒక పక్కకు నిలబెట్టి 'వీరు చంపినట్లుగా సాక్ష్యం ఎవరు చెబుతారని' ప్రశ్నించారు. దానికి కొంత మంది ముందుకు రాగానే వారిని, వీరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తనదైన పద్ధతిలో విచారణ ప్రారంభించారు.

బాలరాజ్‌ను కొట్టి చంపిన 20 మంది నిజాన్ని ఒప్పుకుని ఎలా చంపారో ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు. పోలీసులు తీవ్రంగా గాలిస్తున్న బాలరాజ్ (28) మే 15, 2002 రాత్రి తాను హత్యచేసిన మిత్రుడు ప్రకాశ్ ఇంటికి వెళ్ళి

ఇతనిని ఇక్కడికి తీసుకొచ్చి చెట్టుకు కట్టేసి కొట్టి చంపిందెవరని ప్రశ్నించారు. దానికి మేమంటే మేమని వందలాది ముందుకు వస్తుంటే ఇనస్పెక్టర్ వెంకన్నకు అయోమయం అయిపోయింది.



'నేనే మీ అబ్బాయిని చంపానని అనుమానంతో నామీద కేసు పెట్టారంట. నేనే చంపాను కాని దానికి సాక్ష్యాలు లేవు. అంతేకాదు ఈ కేసును వెంటనే ఉపసంహరించుకోకపోతే మిమ్మల్నందర్నీ కూడా చంపేస్తాను. దీనికికూడా సాక్ష్యాలు లేకుండా చేస్తా'నని బెదిరించి వెళ్ళిపోయాడు. ఈ విషయాన్ని వెంటనే ప్రకాశ్ సోదరుడు పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు మరలా అతనికోసం గాలింపును ఉధృతం చేశారు. అయినా ఆ రాత్రివేళ అతని ఆచూకీ దొరకకపోవడంతో, మరుసటిరోజుకు వాయిదా వేసుకుని పోలీసులు ఇంటి దారి పట్టారు. కాని సుభాష్‌నగర్ కాలనీ ప్రజలు మాత్రం తమ బస్తీలో ఒక కుటుంబానికి జరిగిన అన్యాయం, అందునా ఒక మంచి యువకుడిని స్నేహం పేరుతో నమ్మించి హత్యచేసిన ఆ ఉన్మాదిని ఎలాగైనా తామే కొట్టి చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా అతను ఎక్కడికి వెళ్ళే అవకాశాలు ఉన్నాయో ఆ ప్రాంతాలన్నీ అతనికోసం గాలించారు. చివరికి తిరుమలగిరిలోని, విక్రమపురి కాలనీలో బాలరాజ్ వాళ్ల పిన్ని ఇంట్లో నిద్రపోతున్న బాలరాజ్‌ను పెద్ద సంఖ్యలో గ్రామస్థులు వెళ్లి లేపుకొచ్చారు. అతనిని సుభాష్‌నగర్‌కు తీసుకొచ్చి ఒక చెట్టుకు కట్టేశారు. అతని నోటితోనే అతను చేసిన నేరాలన్నీ చెప్పించారు. చివరికి ప్రకాశ్‌ను ఎందుకు చంపాడన్న విషయాన్ని మాత్రం రాబట్టలేకపోయారు. దానికి కారణం అతనికీ తెలియదని చెప్పడంతో మరింత కోపోద్రిక్తులైన ప్రజలు అతనిపై విరుచుకుపడి దొరికిన చోటల్లా కొట్టి కొట్టి చంపారు. ఈ విషయాలన్నీ పోలీసుల ముందు వారే ఒప్పుకున్నారు. రాళ్ళతోను, కత్తులతోను, ఇనుప రాడ్లతోను అతనిని కొట్టి చంపామని పోలీసుల ఎదుట 20 మంది లొంగిపోయారు. దీంతో వారందరిపైనా హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వారిని 'ఇన్‌స్పెక్టర్ వెంకన్న' జ్యుడీషియల్ రిమాండుకు తరలించారు.

ఇదిలా ఉండగా మాజీ మిలిటెంటైన బాలరాజ్ నగరానికి వచ్చి అనేక నేరాలు చేసి, రౌడీ షీటర్‌గాకూడా పోలీసు రికార్డుల్లో నమోదైంది. అటువంటి కరుడు గట్టిన నేరస్థుడు పోలీసులకు చిక్కి ఉంటే అతను చేసిన మరిన్ని నేరాలు వెలుగు చూసేవి. అతనిని సజీవంగా పట్టుకున్న గ్రామస్థులు ఆవేశంతో అతనిని హతమార్చడంతో చివరికి బాలరాజ్ ప్రకాశ్‌ను ఎందుకు చంపాడో కూడా పోలీసులకు తెలియకుండా పోయింది. ఇప్పటికీ 'ప్రకాశ్‌ది కారణం తెలియని హత్య'గా పోలీసుల దృష్టిలో మిగిలిపోయింది. హంతకుణ్ని నేరుగా అరెస్ట్ చేయలేకపోయినా దీనిపై దర్యాప్తును వేగంగా చేసి మిస్టరీ ఛేదించిన అల్వాల్ పోలీసులను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

**నీలం రాంబాబు నాయుడు**